జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 30-08-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 114 పేజీలు: 8 వెల : రూ.7



## జిల్లాకు అదనపు ఎరువులు

* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం, ఆగస్టు29 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలో ఎరువుల కొరత లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని, అదనపు ఎరువులు కేటాయించాలని మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. శ్రీకాకుళం జడ్పీ సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు ఎరువుల కొరత సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ అంశం అన్ని పత్రికల్లో కథనాలు రావడంతో మంత్రి కింజరాపు స్పందించారు. శ్రీకాకుళం జిల్లాకు అదనపు కేటాయింపులు చేయాలని సూచించారు. దీంతో జిల్లాకు తక్షణమే 820 టన్నుల డీఏపీ, 760 టన్నుల యూరియాను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ మొదటి వారంలో వెయ్యి టన్నుల యూరియాతో పాటు అవసరం మేరకు డీఏపీ పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు.



# వైసీపీ నేతల.. బరితెగింపు!

* తంపర భూముల్లో.. నిబంధనలకు విరుద్ధంగా రొయ్యల చెరువులు * పర్మిషన్లు గోరంతకి.. సాగు చేసేవి కొండంతకి * వారికి కొందరు అధికారుల సహకారం * ఉప్పునీటిగా మారిన చెరువు * వ్యవసాయ భూములకు తీవ్ర నష్టం * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించాలని రైతుల వేడుకోలు

**శ్రీకాకుళం, ఆగస్టు 29 (వార్త):** సంతబొమ్మాళి మండలం హనుమంతు నాయుడుపేట పంచాయతీ సర్పంచ్, వైసీపీ నేత పాల మహేష్ రెడ్డి, వారి అనుచరులు అక్రమంగా రొయ్యల చెరువుల సాగు.. రైతుల పాలిట శాపంగా మారింది. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా బతుకుతున్న పలువురు రైతులకు అన్యాయం ఈ నేతలు అన్యాయం చేస్తున్నారు. తమ స్వార్థం, కాసుల కోసం సుమారు 50 మంది రైతులకు ఇబ్బందులు కలుగజేస్తున్నారు. దీనిపై గతంలో వైసీపీ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు. హనుమంత నాయుడుపేట పంచాయతీ టెంకపేట, చిన్న కేశనాయుడుపేట, సీరపు వాణి పేట, తదితర గ్రామాల సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల్లో వైసీపీకి చెందిన కొందరు నాయకులు అక్రమంగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారు. నిబంధన విరుద్ధంగా వ్యవసాయ సాగు భూముల్లో ఉప్పునీటి రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారు. ఈ రొయ్యల చెరువుల కింద సుమారు 500 ఎకరాలు పంట పొలాలు ఉన్నాయి. ఈ రొయ్యల సాగు వల్ల సుమారు 50 ఎకరాల వరకు ఉప్పు నీటి ప్రభావంతో గత5 సంవత్సరాలుగా పంటలు పండడం లేదు. రొయ్యల చెరువు నుండి ఉప్పునీరు పొలాల్లోకి చేరి పంట పొలాలు నాశనం అవుతున్నాయి. ధైర్యం చేసి పెట్టుబడి పెట్టి పంటలు వేసినప్పటికీ చివరి దశలో ఉప్పునీటి ప్రభావంతో పంటలు ఎండిపోయి తీవ్ర నష్టం జరుగుతోందని పలువురు రైతులు తెలిపారు. ఈ నేపథ్యంలో పలుసార్లు గత ప్రభుత్వ హయాంలో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వ్యవసాయ అవసరాలకు వాడుకునే 12 ఎకరాల చెరువు కూడా ఉప్పునీరు గా మారిపోయిందని పలు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంశధార నీరు పంట పొలాల వరకు వచ్చినప్పటికీ చెరువులోకి నింపుకునే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు ఈ నేపథ్యంలో అక్రమ రొయ్యల సాగు చేస్తున్న స్థానిక జడ్పీటీసీ పాల వసంత రెడ్డి, సర్పంచ్ పాల మహేశ్వర్ రెడ్డిలపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదని వాపోతున్నారు. రైతు ప్రయోజనాలే ముఖ్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.





## శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా ప్రసాదరావు

**శ్రీకాకుళం, ఆగస్టు 29 (వార్త):** శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా పీవీవీడీ ప్రసాదరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్‌లో గ్రేడ్-1 మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న ప్రసాదరావుకు ఇక్కడకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం సుడా చైర్మన్ ఓబులేసు ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపడుతున్నారు. అలాగే పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్‌ను కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయింది.

# దంతలో. బోగస్ పింఛన్లు



* గ్రామంలో 73మందికి దివ్యాంగ పింఛన్లు
* అనుమానంతో ఫిర్యాదు చేసిన టీడీపీ శ్రేణులు
* విచారణ చేపట్టిన మండల అధికారులు
* పలువురు దివ్యాంగులు గైర్హాజరు

**టెక్కలి, ఆగస్టు 29 (వార్త):** కోటబొమ్మాళి మండలం, కురుడు పంచాయతీ దంత గ్రామంలో పింఛన్ల లొల్లి సాగుతోంది. ఒకే గ్రామంలో 73 మందికి దివ్యాంగుల పెన్షన్లు ఉండడంతో పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గ్రామంలో ఉపాధి హామీ పనుల తనిఖీ నిర్వహించినప్పుడు పలువురు టిడిపి వర్గీయులు గ్రామస్తులు అక్రమ పెన్షన్స్‌పై ఫిర్యాదు చేశారు. అలాగే కోటబొమ్మాళి మండల పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ పెన్షన్స్ వ్యవహారంపై టిడిపి వైసిపి వర్గీయులు గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామంలో మండల పరిషత్ అధికారులు డాక్టర్ సమక్షంలో వికలాంగుల పెన్షన్ పై విచారణ చేపట్టారు. అయితే ఒకే గ్రామంలో 73 మంది వికలాంగుల పెన్షన్ పొందడం చర్చనీయాంశంగా మారింది. అయితే ప్రస్తుతం పూర్తి ఆధారాలు వికలాంగు సదరం సర్టిఫికెట్‌లతో ఇప్పటికీ 30 మంది వరకే హాజరైనట్లు తెలుస్తోంది. మిగతా వాటిపై అధికారులు పూర్తి దర్యాప్తు నిర్వహించి నివేదికను జిల్లా కలెక్టర్ అందజేస్తామని మండల పరిషత్ అధికారి ఫణీంద్ర కుమార్ తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పీఏ మురళి స్వగ్రామం కావడంతో ఇక్కడ బోగస్ పింఛన్లు మంజూరు చేశారనే విమర్శలు వచ్చాయి.




ఆమదాలవలస క్రీడా మైదానం

# కుండపోత

* జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం
* పొలాల్లోకి చేరిన నీరు
* లోతట్టు ప్రాంతాలు జలమయం
* మరో రెండు రోజులు పాటు వాన

**ఆమదాలవలస, ఆగస్టు29 (వార్త):** బంగాళా ఖాతంలో అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షం కురుస్తోంది. గురువారం ఎడతెరిపి లేకుండా వాన కురుస్తునే ఉంది. పంట పొలాల్లోకి నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమైంది. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వరద నీటితో నిండిపోయింది. భారీవర్షానికి చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు పలు మార్లు అంతరాయం ఏర్పడింది. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ చెరువును తలపించింది. బంగాళఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారిందని, మరో రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

### చెరువుకు గండి

**సంతబొమ్మాళి:** కొల్లిపాడు గ్రామంలో గుండమ్మ చెరువుకు గురువారం గండి పడింది. సుమారు 50 ఎకరాల వరకు నాట్లు ముంపు బారిన పడ్డాయి.

## తెలుగు భాష ఔన్నత్యం చాటిచెప్పిన మహనీయుడు గిడుగు



4లో

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అమ్మను మించిన దైవం ఉన్నదా..!

■ **తల్లికి గుడి కట్టిన కుమారులు**

సారవకోట, ఆగస్టు 29 (వార్త): అమ్మకు గుడి కట్టి తమకు మాతృమూర్తిపై ఉన్న గౌరవాన్ని, ప్రేమను చాటుకున్నారు ఆ కుమారులు. పెద్దలంబకు చెందిన లుకలాపు వరలక్ష్మమ్మ ఆనారోగ్యంతో నెల రోజుల కిందట మృతి చెందారు. ఆమె కుమారులు లక్ష్మీనారాయణ, భాస్కర రావు తల్లి మీద ప్రేమతో రూ.25 లక్షలతో ఆమెకు గుడి కట్టి విగ్రహాన్ని నెలకొల్పారు. ఈ ప్రతిమను మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ గురువారం ఆవిష్కరించారు.



# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మందస, ఆగస్టు 29(వార్త): కొత్త పల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు భాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గణేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగుభాష ప్రాముఖ్యతను వివరించారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ కృషిని విద్యార్థులకు తెలిపారు. తెలుగు ఉపాధ్యాయుడు అబ్రహం, వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్‌ను ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్‌కుమార్, పి.రాంబాబు, జి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో గిడుగు, ధ్యానచంద్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు

కుంటికోటలోని నారాయణ హైస్కూల్‌లో తెలుగు భాష, జాతీయ క్రీడాదినోత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థుల తెలుగుతల్లి... తెలుగు కవుల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గుంట రోహిణీశంకర్ మాట్లాడుతూ ప్రపంచ భాషల్లో తెలుగుభాష ఎంతో తీయనిది అన్నారు. తెలుగు కవుల రచనలు ఎప్పటికీ చిరస్మరణీయమన్నారు. మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ క్రీడాకారునిగా దేశానికి చేసిన సేవలు వివరించారు. అనంతరం సంప్రదాయ వంటకాలతో సహపంక్తి భోజనాలను చేశారు. కార్యక్రమంలో గుంట అరవింద్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కుంటికోటలో కె.నారాయణ హైస్కూలులో ఆకట్టుకున్న తెలుగుకవుల వేషధారణ



**నరసన్నపేట:** సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. తెలుగు భాష, గిడుగు రామ్మూర్తి గొప్పతనాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా వీఎన్ పురం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

**సారవకోట:** సవరబొంతు ఆశ్రమ పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి తెలుగు భాష గొప్పదనంపై విద్యార్థులకు చర్చా పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఈటీ వనజాక్షి విద్యార్థులకు పలువురు క్రీడాకారుల జీవిత చరిత్రను వివరించారు.



**పాతపట్నం :** పాతపట్నంలోని ఆదర్శ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి పంతులు, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు ప్రిన్సిపాల్ కేవీ రత్నకుమారి, ఉపాధ్యాయులు పుష్పాలంకరణ చేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం రత్నకుమారి మాట్లాడుతూ తెలుగు భాషా గొప్పదనం, క్రీడల ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు లోకేష్ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు బి.మురళి తదితరులు పాల్గొన్నారు.



**జలుమూరు :** జలుమూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం వేణుగోపాలరావు ఆధ్వర్యంలో గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యంపై వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.




# పెండింగ్ నీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలి

● **ఏఐకేఎంఎస్ డిమాండ్**

మందస, ఆగస్టు 29(వార్త): జిల్లాలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్)రాష్ట్ర సహాయ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ డిమాండ్ చేశారు. విప్లవయోధులు కుమారన్న, సీతారాముల వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరుతూ మందస మండలంలోని పలు ఆదివాసీ గ్రామాల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. సోంపేట, కాకరాపల్లి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల భూములను పేదలకు, రైతులకు పంపిణీ చేయాలని కోరారు. జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పాలని, మూతపడిన పరిశ్రమలను తెరిచి కార్మికులకు ఉపాధిని కల్పించాలన్న దీర్ఘకాలిక డిమాండ్లను కూడా పాలకులు తుంగలో తొక్కారని విమర్శించారు. స్మారక కమిటీ అధ్యక్షుడు గొరకల బాలకృష్ణ మాట్లాడుతూ ఉద్దానం ప్రజల ప్రధాన జీవనాధారమైన జీడి పంటకు పాలకులు గిట్టుబాటు ధరను కల్పించలేక చేతులెత్తేశారన్నారు. ఉద్దానం పోరుబాటనే నమ్ముకుని సాగుతోందన్నారు. స్మారక కమిటీ కార్యదర్శి పోతనపల్లి మల్లేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 1/70 చట్టం అమలు కాని దుస్థితిలో..గిరిజనేతరులు ఇక్కడి భూములపై అధికారాన్ని, ఆధిపత్యాన్ని కైవసం చేసుకున్నారని వాపోయారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కుసుమ మాట్లాడుతూ సోషలిస్టు, కమ్యూనిస్టు వ్యవస్థలను నెలకొల్పడానికి ప్రతిన బూనుదామన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ ప్రతినిధులు సీమలన్న, సురంగి, భాగ్యవతి, ప్రశాంతి, ప్రకాష్, మనోహర్ బిల్లు, లలిత, బట్టు, సాయి తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

## 'నేర రహిత మందసగా తీర్చిదిద్దుతా'



మందస, ఆగస్టు 29 (వార్త): మందసను నేర రహిత మండలంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ఎస్ఐ ఎస్కే ఖాదర్‌బాషా అన్నారు. మందస పోలీసుస్టేషన్లో గురువారం ఆయన మహిళా పోలీసులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నేరాలు తగ్గించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మండల వివరాలు, భౌగోళిక పరిస్థితులు, వివిధ ప్రాంతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాలు, ఈవ్‌టీజింగ్, ట్రాఫిక్ సమస్యలు, సారా తయారీ, అమ్మకాలు, రవాణాపై చర్చించారు. గ్రామాల సమాచారం మహిళా పోలీసుల వద్ద ఉంటుందని, వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ప్రజలను అప్రమత్తం చేయండి

నరసన్నపేట, ఆగస్టు 29 (వార్త): భారీ వర్షాలకు నదీ తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు నరసన్నపేట తహసీల్దార్ సత్యనారాయణ సూచించారు. గ్రామాల్లో వీఆర్వోలు ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల కేంద్రానికి తెలియజేయాలన్నారు. మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# భౌబోయ్

■ **నరసన్నపేటలో వణుకు పుట్టిస్తున్న గ్రామ సింహాలు**

నరసన్నపేట, ఆగస్టు 29 (వార్త): నరసన్నపేటలో ఇటీవల కాలంలో కుక్కలు ఎక్కువ కావడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. పాదచారులు, విద్యార్థులపై దాడులు చేస్తున్నాయని వారు వాపోతున్నారు. వేరే మండలాల నుంచి శునకాలను పట్టుకుని ఇక్కడ పట్టణంలో విడిచిపెడుతున్నట్లు స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి వీటిని నియంత్రించాలని వారు కోరుతున్నారు.



## మాకివలస మంచినీటి పైపులైన్ ధ్వంసం



సారవకోట, ఆగస్టు 29 (వార్త): మాకివలస రక్షిత మంచినీటి పథ కం పైపు పైపులైన్‌ను గుర్తు తెలి యని వ్యక్తులు కోసేశారు. మాకి వలస కొండపై నుంచి పైపులైన్ల ద్వారా నీరు సరఫరా అవుతోంది. ఈ నీరు వృథాగా పోతోందని స్థాని కులు తెలిపారు. ధ్వంసం చేసిన దుండగులను శిక్షించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎస్.మార్ట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మామిడి



పాతపట్నం, ఆగస్టు 29 (వార్త): పాతపట్నం మండలం తెంబూరు గ్రామంలో పెద్దలక్ష్మీపురం సర్పంచ్ ప్రతినిధి అన్నెపు ఉమామహేశ్వరరావుకు చెందిన ఎస్.మార్ట్ స్టోర్‌ని గురువారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. ఉమామహేశ్వరరావు వ్యాపారంలో ఉన్నతస్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు.

## తోపుడు బండ్ల వ్యాపారులపై చర్యలు వద్దు



నరసన్నపేట, ఆగస్టు 29(వార్త): నరసన్నపేటలో రోడ్డుకిరువైపులా తోపుడు బండ్లపై వ్యాపారులపై ఏ చర్యలు తీసుకోవద్దని పట్టణ కళింగ వైశ్య సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి వెంకటరావు కోరారు. ఈ మేరకు వారు గురువారం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజ శారు. ఈ విషయంలో వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. వీరి వెంట కోశాధికారి రమేష్ తదితరులు ఉన్నారు.

## శ్మశానవాటిక అభివృద్ధికి భూమి పూజ

ఇచ్ఛాపురం, ఆగస్టు 29(వార్త): ఇచ్ఛాపురంలోని వల్లభరాయగెడ్డ శ్మశానవాటిక అభివృద్ధికి రోటరీ క్లబ్ ప్రతినిధులు భూమిపూజ చేశారు. గ్యాస్ సంహిత ఆధార దహన సంస్కార యంత్రం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అసిస్టెంట్ గవర్నర్ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

# సూరాడ వీధి జలమయం

■ వర్షం పడితే చాలు రెండు దశాబ్దాలుగా ఇదే దుస్థితి

■ ఎమ్మెల్యే శిరీష స్పందించాలని వీధి ప్రజల డిమాండ్

సూరాడ వీధి సమస్య రెండు దశాబ్దాలుగా అపరిష్కృతంగానే మిగిలిపోయింది. ప్రజా ప్రతినిధులు ఎందరొచ్చినా హుకుంపేట, సూరాడ ప్రజల తలరాతలు మాత్రం మారలేదు. వర్షం పడితే చాలు సూరాడ వీధి ముంపునకు గురవుతుంది. ఈ సమస్య పరిష్కరించాలని ఎన్నిసార్లు కథనాలు ప్రచురితమైనా చెవిటివాని ముందు శంఖం ఊదిన చందంగా ఉందే తప్ప పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని ఆ వీధి ప్రజలు కోరుతున్నారు.

-వజ్రపుకొత్తూరు



# క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి

పాతపట్నం, ఆగస్టు 29 (వార్త): పాతపట్నంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు.

క్రీడలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని, మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ టి.హేమసుందం రావు అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నరసన్నపేట:** క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం ప్రతి ఒక్కరికి కలుగుతుందని నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లత అన్నారు.

గురువారం జాతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం కళాశాలలో నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ విద్యార్థులు క్రీడలపై ఆసక్తి కనబరచాలని, సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని సూచించారు.




# చిన్నారి వైద్యానికి చేయూత

**కేన్సర్ చికిత్స కు రూ.93వేలు అందజేసిన హెల్పిండ్‌హ్యాండ్స్**

ఇచ్ఛాపురం, ఆగస్టు 29(వార్త): కంచిలి మండలం కర్తలి గ్రామానికి చెందిన పైల రిషి అనే రెండేళ్ల చిన్నారి క్యాన్సర్ బారిన పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ సేవా సంస్థ ..కొంతమంది స్నేహితుల సహాయంతో రూ.93 వేలు ఆర్థిక సాయం చేశారు.

కార్యక్రమంలో సంస్థ సభ్యులు నీలాపు దాసు, నీలాపు డాన్, మసూపత్రి హేమసుందర్, సావాడ గణేష్ రెడ్డి, పనపాన విస్సు, నీలాపు రమేష్, నీలాపు శేఖర్, నీలాపు చైతన్య, నీలాపు వంశీ, పిట్ట యువ రాజు, నీలాపు సంతోష్, ఎదురు శివ శంకర్, కర్తలి గ్రామ పెద్దలు పైల సూర్యనారాయణరెడ్డి, వాసాల రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ఎంకే మిశ్రోకు అఖండ నంది అవార్డు



ఎల్ఎన్ పేట, ఆగస్టు 29 (వార్త): లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ సర్వీసెస్ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడు ఎంకే మిశ్రో విద్యా, సామాజిక, సేవా, ఆధ్యాత్మిక రంగాల్లో చేస్తున్న విశిష్ట సేవలకుగాను హైదరాబాద్‌కు చెందిన 'గోల్డ్ ఫ్యూచర్ గ్లోబల్ సేవా ఫౌండేషన్, మొరాద్ ఫౌండేషన్ వారు 'అఖండ నంది'అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవార్డు మిశ్రోకు రావడంపై ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, లయన్స్ క్లబ్ సభ్యులు, అధికారులు, దివ్యాంగ సంఘాల సభ్యులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు.

## జలుమూరు ఎస్ఐగా అశోక్ బాధ్యతల స్వీకరణ

జలుమూరు, ఆగస్టు 29 (వార్త): జలుమూరు ఎస్ఐగా అశోక్‌బాబు గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ మధుసూదనరావుకు విశాఖపట్నానికి బదిలీ కాగా, ఈ స్థానంలో అశోక్‌బాబును నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. గతంలో నరసన్నపేటలో విధులు నిర్వహించానని అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో తన వంతు విధులను చిత్తశుద్ధితో నెరవేరుస్తానన్నారు.

# వైభవంగా ఉట్ల సంబరం

ఇచ్ఛాపురం, ఆగస్టు 29 (వార్త): శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకల్లో భాగంగా బేల్లుపడ కాలనీ, కాకతీయ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్ల సంబరం వేడుకలు వైభవంగా గురువారం నిర్వహించారు. 4వ వార్డు పరిధిలో డబ్బురి వీధి, కాళికామాత గుడి, జ్ఞానభారతి స్కూల్ దగ్గర ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జనసేన నాయకులు దాసరి రాజు, యాదవ యువత, ఆయా కాలనీల వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఉట్ల సంబరం నిర్వహిస్తున్న యాదవులు

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక





## 31నే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**శ్రీకాకుళం, ఆగస్టు 29(వార్త):** ఈనెల 31వ తేదీ నుంచే ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ మొదలు కావాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ నెల పెన్షన్‌లను ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు అందించాలన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో.. ఒక రోజు ముందుగానే అంటే ఆగస్ట్ 31వ తేదీన పెన్షన్ల పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఆ రోజు పూర్తిగా అందని వారికి సెప్టెంబర్ 2వ తేదీన సోమవారం రోజున పంపిణీ చేయాలని, కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని స్పష్టం చేశారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు పర్యవేక్షిం చాలనీ, ఎక్కడ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలనీ చెప్పారు. మొదటి రోజే వంద శాతం పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని లక్ష్యంగా చేసుకుని పనిచేయాలని సూచించారు.

### తెలుగు భాష ఔన్నత్యం చాటిచెప్పిన
# మహనీయుడు గిడుగు

### జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్




**శ్రీకాకుళం, ఆగస్టు 29(వార్త):** తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిన మహనీయుడు, తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి అని జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలు నిర్వహించారు. గిడుగు వెంకట రామమూర్తి, పంతులు చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన గావించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు మాధుర్యాన్ని ప్రజలకు అందించిన కీర్తి గిడుగుదేనని, తెలుగు భాష గొప్పదని కొనియాడారు. తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసేందుకు ఆయన ఎనలేని కృషి చేశారని చెప్పారు. ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తుగా గిడుగు రామ్మూర్తి జయంతినే మాతృ భాషా దినోత్సవంగా చేసుకుంటున్నామన్నారు. తెలుగుభాషతో పాటు సవర లిపి కనుగొని భాషోద్యమానికి చేసిన కృషికి బ్రిటిష్ ప్రభుత్వం రావ్ బహదూర్ అని బిరుదాకింతులు పొందిన కీర్తి గిడుగు సొంతమన్నారు. కార్యక్రమంలో ఎల్.డి.ఎం సూర్య కిరణ్, కలెక్టరేట్ కార్యాలయం ఏవో సూర్యనారాయణ, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### గిడుగు రామమూర్తికి జనజాగృతి నివాళి

**పలాస, ఆగస్టు 29(వార్త):** పలాస కాశీబుగ్గ జనజాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో కాశీబుగ్గ కార్యాలయంలో గిడుగు రామమూర్తి పంతులు 161వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జాగృతి అధ్యక్షుడు డా.కుమార్ నాయక్ అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన, గిడుగు రామమూర్తి చిత్ర పటానికి పూలమాలాలంకరణ గావించి నివాళులర్పించారు. జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత కుదమ తిరుమలరావు ముఖ్య అతిథిగా హాజరై, గిడుగు రామమూర్తి జీవితంపై సమగ్ర కవితాపఠనం గావించారు. అనంతరం తిరుమలరావును జనజాగృతి అధ్యక్షుడు డా.కుమార్ నాయక్, వ్యవస్థాపక అధ్యక్షుడు డా.తెప్పల కృష్ణమూర్తి, ప్రముఖ రచయిత కుత్తుమ వినోద్, కె.రోజారాణిలు శాలువా, జ్ఞాపికతో సన్మానించారు.

### అమ్మ భాషను కాపాడుకుందాం

మన అమ్మ భాష తెలుగు భాషను కాపాడుకొని భవిష్యత్తు తరానికి అందివ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర నాయకుడు కోనార్ హేమ సుధన్ అన్నారు. తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. గురువారం పలాసలోని వేదిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలన్నీ వారి వారి మాతృ భాషల్లోని పరిపాలన వ్యవహారాలు సాగిస్తున్నారని, అందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగు భాషను విస్మరించి ఆంగ్ల భాషను భుజాన మోస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర భాషలను గౌరవించడం మన సాంప్రదాయం అయినప్పటికీ, మాతృభాష లోనే పరిపాలన వ్యవహారాలు సాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగం బ్రదర్ సాంస్కృతి వేదిక రాష్ట్ర నాయకులు సి హెచ్ జగదీష్, జిల్లా అధ్యక్షులు కొర్రాయి శ్రీకాంత్, రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ప్రచార కార్యదర్శి దుబ్బరాజ గోపాల్, జిల్లా నాయకులు కొర్ననా బాలాజీ, తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామకృష్ణపురంలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామమూర్తి జానపద కళాపీఠ వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు మాస్టర్‌తో పాటు మూల తాతయ్య మాస్టర్, తెలుగు ఉపాధ్యాయుడు మురళి, సాంబమూర్తి, కిరణ్ , దేవా జగదీశ్వరి, ప్రవీణలకు సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రీతీచౌదరి, జగదీష్, భాస్కర్ పాల్గొన్నారు.



## బ్యాంకర్ల భాగస్వామ్యంతోనే ఆర్థిక ప్రగతి

### కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, ఆగస్టు 29 (వార్త):** జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతో అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా స్థాయి డిసిసి, డిఎల్ఆర్‌సి సమావేశం కలెక్టరేట్లో గురువారం జరిగింది. ఈ సమావేశంలో వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖలవారీగా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొదటి త్రైమాసికం జూన్ 30వ తేదీ నాటికి క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.12943 కోట్లకు గాను 4887 కోట్ల రుణాలు మంజూరు చేసి 38 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి మొదటి ఆర్థిక సంవత్సరానికి త్రైమాసికం నాటికి వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.8343 కోట్లు లక్ష్యానికి గాను రూ.2792 కోట్ల రుణాలు అందజేసి 34 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకింగ్ లావాదేవీలు మరింత బలోపేతం చేయాలన్నారు. బడుగు, బలహీనవర్గాల వారు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్టాండప్ ఇండియా, ముద్ర, గ్రామీణ ఖాదీ బోర్డు వంటి పథకాలతో పాటు పంట రుణాలు, విద్యారుణాలు లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై దృష్టి సారించాలని బ్యాంకర్లకు సూచించారు. చిరు వ్యాపారులకు, చిన్న చిన్న యూనిట్లను స్థాపించే వారికి ముద్ర రుణాలు ఎంతో ప్రయోజనకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఎటువంటి హామీ చూపించకుండానే ఈ రుణాలను బ్యాంకులనుంచి సులువుగా పొందవచ్చునని సూచించారు. పిఎంఈజిపి కింద రుణాలు మంజూరు చేసి, వెంటవెంటనే యూనిట్లను స్థాపింపజేయాలని ఆదే శించారు. ఈ మేరకు వివిధ బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించాలని అధికారులను ఆదేశించారు. యూనిట్ల స్థాపనకు ధరఖాస్తు చేసుకున్నవారికి మొత్తం ఎనిమిది రోజుల్లోనే ప్రభుత్వ శాఖలు అనుమతులను మంజూరు చేసి, రుణాల కోసం ధర ఖాస్తులను బ్యాంకులకు పంపించాలన్నారు. ప్రభుత్వ పథకాల క్రింద రుణ మం జూరులో రానున్న మూడు నెలల్లో ఖచ్చితమైన ప్రగతిని చూపించాలని ఆదేశిం చారు. స్టాండప్ ఇండియా పథకం కింద ఒక్కో బ్యాంకు బ్రాంచ్ నుంచి ఇద్దరికి రుణాలను మంజూరు చేయాలన్న లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. కౌలు రైతులు నష్టపోకుండా చూడాలని, వీలైనంత వేగంగా కౌలుదారుల గుర్తింపు కార్డు లను పంపిణీ చేయాలన్నారు. అర్హులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులను జారీ చేయాల న్నారు. పిఎం స్వానిధి, పంట రుణాలు, టిడ్కో రుణాలు, పిఎంఎఫ్ఎంఈ తదితర పథకాల కింద తీసుకున్న లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ప్రభుత్వ శాఖలు, బ్యాంకుల వారీగా సమీక్షించారు. ప్రజల జీవనోపాది మెరుగుపడే విధంగా ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా జిల్లా జిడిపి వృద్ధి చెందేందుకు కృషి చేయాలన్నారు. పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందినప్పుడే ఇది సాధ్యపడుతుం దన్నారు. ఇందుకు బ్యాంకర్లు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తం..

ప్రతి గ్రామంలో రైతులు, మహిళా సంఘాలు, విద్యార్థులకు బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను తరచూ నిర్వహించాలన్నారు. ప్రస్తుతం మోసగాళ్లు సైబర్ నేరాల ద్వారా ప్రజల ధనాన్ని దోచుకుంటున్నారని, సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని, ఎవరూ కూడా సైబర్ నేరాల బారినపడి మోసపోకుండా వారు తమ సహచర విద్యార్థులకు, తమ కాలనీవాసులు, ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రయత్నించాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్య కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎం.వి. తిలక్, ఆర్బిఐ ఏపీ రీజియన్ ఎల్డిఓ గిరిధర్ బెహరా, నాబార్డు డి డి ఎం కే రమేష్ కృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కే.శ్రీధర్, పశు సంవర్ధక శాఖ జేడీ జయరాజు, డిసిసిబి సీఈవో వరప్రసాద్, జిల్లాలో 26 బ్యాంకులకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**పలాస, ఆగస్టు 29(వార్త):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాశీ బుగ్గ ప్రాంగణంలో ధ్యాన్ చంద్ విగ్రహం వద్ద పలాస నియోకవర్గ వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వ హించారు. కాశీబుగ్గ, గోవిందపురం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చిన్నం నాయుడు, కె.హరిబాబులు.. ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మెంబర్ పి.తవిటయ్య, సిహెచ్ పద్మలోచనం, పి.గజేంద్ర, స్.చంద్ర శేఖర్, వై.కె.హరనాద్, కె.రామారావు పాల్గొన్నారు. అలాగే పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు టి. చిట్టిబాబు.. ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది కార్యదర్శి కె.మాధవరావు, స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, బి.శంకరరావు, ఆర్. శ్రీనివాసరావుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం,జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణారావు అధ్య క్షతన జరిగిన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు చెల్లూరు పద్మలోచన, తెలుగు ఉపాధ్యాయులు ఈశ్వరరావు, రజని కుమారి, లక్ష్మీబాయి, సిబ్బంది ఈశ్వరరావు, మధుబాబు, రమేష్, కొయ్యల శ్రీనివాసరావు, జనార్ధనరావు , పద్మ, చంద్రశేఖర్, యామిని, మెహర్ సుధ, కిషోర్, అరుణ కుమారి, కృష్ణవేణి, చిన్నా రావు, విష్ణాచారి, రవితేజ, కోటేశ్వరరావు, తులసి రాణి పాల్గొన్నారు.అలాగే డిగ్రీ కళాశాల మైదానంలో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె వెంకటలక్ష్మి, ఫిజికల్ డైరక్టర్ పి. మధు, వైస్ ప్రిన్సిపాల్ గణపతి, అధ్యాపకులు వెంకట రమణ, సాయిరాం, రాజేష్ పాల్గొన్నారు.

# యాంత్రీకరణతో అధిక దిగుబడులు

*** రైతులకు అవగాహన అవసరం * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * యాంత్రీకరణతో తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి: ఎమ్మెల్యే గొండు శంకర్ * రాగోలులో యాంత్రీకరణ మేళా**





**శ్రీకాకుళం, ఆగస్టు 29(వార్త):** రైతులు వ్యవసాయ యాంత్రీకరణపై పరిజ్ఞానం పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిశోధన సహ సంచాలకులు, ఉత్తర కోస్తా మండలం, రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ శాఖలు ఏర్పాటు చేసిన వ్యవసాయ యాంత్రీకరణ మేళాను రాగోలులో గురువారం స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్, నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన 26 రకాల వ్యవసాయ యాంత్రీకరణ స్టాల్స్, యూనివర్సిటీ ఏర్పాటు చేసిన స్టాల్స్ ను సందర్శించారు. యాంత్రీకరణ మేళా అనంతరం ఏర్పాటు చేసిన సభలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రైతులు యాంత్రీకరణను ఉపయోగించి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. యాంత్రీకరణతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాల న్నారు. చిన్న సన్నకారు రైతులు అన్ని రకాల యంత్రాలను వినియోగించుకోవచ్చన్నారు. ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో సాగు నీటికి కొరత లేదని తెలుసుకొని జిల్లాలోని రైతాంగానికి యాంత్రీకరణపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతుల కోసమే విశ్వవిద్యాలయం, పరిశోధనా స్థలం ఉందని, పంటలలో వచ్చే లోటుపాట్లను తెలుసుకోవచ్చని చెప్పారు. రైతులు సమిష్టిగా పని చేసుకుంటే సబ్సిడీపై యంత్రాలను బ్యాంకు రుణం ద్వారా తీసుకుని వినియోగించుకోవచ్చని తెలిపారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ అందరికి అన్నం పెట్టే రైతు పస్తులు ఉన్న పరిస్థితి ఉంద్నారు. రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహించే ప్రభుత్వం ప్రస్తుతం ఉందని చెప్పారు. వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్ మాట్లాడుతూ యాంత్రీకరణ వినియోగంపై ఇప్పటికే ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. రాగోలు పరిశోధన కేంద్రానికి ఆర్ఓ ప్లాంటు స్పాన్సర్ చేయనున్నట్లు కోరమాండల్ నుండి వచ్చిన సుబ్బారెడ్డి తెలిపారు. పరిశోధకులు డా. సాంబమూర్తి మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించి వ్యవసాయ రంగంలో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. డ్రోన్ వినియోగంపై 12 రోజులు శిక్షణ ఉంటుందని చెప్పారు. జిల్లాలో సుమారు 30 డ్రోన్లు ఉన్నాయన్నారు. డాక్టర్ రమణ, డాక్టర్ పివి కె జగన్నాథం మాట్లాడుతూ అవగాహన పెంచుకొని సాంకేతికతను వినియోగించుకొని పెట్టుబడులు తగ్గించుకోవచ్చన్నారు. ఆర్గానిక్ పంటలతో బెల్లం తయారు చేసి తిరుపతి లడ్డూ తయారు చేసేందుకు పంపుతున్నట్లు చెప్పారు. ఇందుకు అనకాపల్లిలో శిక్షణ కేంద్రం ఉందని, ఎవరైనా వస్తే శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో పరిశోధక సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ, డాక్టర్ ప్రమీల రాణి, వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, నాబార్డు డీడీ ఎం రమేష్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఆత్మ పిడీలు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## హిరమండలం ఎస్ఐగా మహ్మద్ యసీన్ బాధ్యతల స్వీకరణ

**హిరమండలం, ఆగస్టు 29 (వార్త):** మండలంలో అసాంఘిక చర్యలు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ మహ్మద్ యసీన్ అన్నారు.గురువారం హిరమండలం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలను స్వీకరించారు. పాతపట్నం ఎస్.ఐగా పనిచేస్తూ హిరమండలం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎస్.ఐ జి.నారాయణస్వామిని శ్రీకాకుళం వీఆర్‌కు వెళ్లారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.ఐ ఎండి.యసీన్‌కు పోలీస్ సిబ్బందితోపాటు పలువురు రాజకీయనాయకులు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.అసాంఘీక కార్యక్రమాలు గంజాయి,జూదం,నాటుసారా విక్రయాలు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు.యువత చెడు మార్గంలోకి పోకుండా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడతానని, మైనర్ డ్రైవింగ్‌పై దృష్టిసారించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు.



## ఆసుపత్రి అభివృద్ధి ప్రతీ ఒక్కరి బాధ్యత

**హిరమండలం, ఆగస్టు 29 (వార్త):** ఆసుపత్రి అభివృద్ధి ప్రతీ ఒక్కరి బాధ్యతని ఎంపీపీ తూలుగు మేనక సూచించారు. గురువారం హిరమండలం పిహెచ్‌సిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం వైద్యాధికారి సిహెచ్.సాయిగీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ మేరకు ఎంపీపీ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆమె సూచించారు. ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉన్నట్లయితే తెలియజేయాలని,ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు.అలాగే వర్షాకాలంలో మందులు కొరత లేకుండా చూడాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో తహశిల్దార్ బి.వెంకటరమణ, ఎంపీడీఒ బి.శైలజ, హిరమండలం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పంచాయతీ సర్పంచ్‌లు డి.సుందరమ్మ, యందవ విజయమ్మ పాల్గొన్నారు.

## క్రీడల నిర్వహణకు సన్నద్ధం కావాలి

**హిరమండలం, ఆగస్టు 29 (వార్త):** వచ్చే నెల 10 నుంచి 13 వరకు మండల స్థాయి క్రీడల నిర్వహణకు సన్నద్దం కావాలని మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు సూచించారు.గురువారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 10 నుంచి 13 వరకు నాలుగు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వ క్రీడా విభాగం నిర్దేశాల మేరకు మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ పోటీలను కల్లట కార్మెల్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. మొదటి రెండు రోజులు బాలురకు, మరో రెండు రోజులు బాలికలకు ఐదు రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ,ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులందరూ విద్యార్థులచే ఎంట్రీ ఫారం నమోదు పర్చేలా,ఎంట్రీ ఫీజు చెల్లించేలా చొరవ తీసుకుని తగు నివేదిక సమర్పించాలని ఆయన కోరారు. మండల స్థాయిలో గెలుపొందిన విజేతలకు నియోజకవర్గ స్థాయిలో పోటీలకు అర్హులవుతారన్నారు

## ఎమ్మెల్యే రవికుమార్‌కు సన్మానం




**పొందూరు, ఆగస్టు29 (వార్త):** ఆమదాలవలస ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత తొలిసారిగా మండల పరిషత్ కార్యాలయానికి హాజరైన కూన రవికుమార్‌ను ఎంపీపీ, ఎంపీడీవో, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సన్మానించారు. మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేకు ఎంపీపీ కిల్లి ఉషారాణి, ఎంపీడీవో సీపాన హరిహరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల పరిషత్ సిబ్బంది దుశ్శాలువాకప్పి, జ్ఞాపికను అందజేశారు.

## పాదాలమ్మతల్లికి స్వాతీ శంకర్ పూజలు

**గార, ఆగస్టు 29 (వార్త):** అంపోలు రోడ్‌లోని పాదాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ పాల్గొని పూజలు చేశారు. అమ్మవారికి పూజలు చేశారు.

## మెట్టూరులో ఉచిత దంత వైద్య శిబిరం

**కొత్తూరు, ఆగస్టు 29 (వార్త):** మండల కేంద్రంలోని మెట్టూరు బిట్ -2 పంచాయతీ, పాడలి గ్రామంలో గురువారం శ్రీకాకుళం లోని సాయి డెంటల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా టూత్ బ్రష్లు, టూత్ పేస్టులు, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల వైస్సార్సీపీ నాయకులు, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ చింతాడ సూర్య నారాయణ, వైసీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీను, మెట్టూరు సర్పంచ్ ప్రతినిధి మొజ్జాడ చక్రపాణి, యర్లంకి ధర్మారావు, తెర్లంగి కృష్ణ మోహన్, శివాజీ, డెంటల్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.




### ప్రమాదకరంగా..

# అలికాం-బత్తిలి రహదారి

*** దారిపాడవునా పెద్ద పెద్ద గోతులు * వర్షం పడడంతో గోతుల్లోకి నీరు * కనీసం గోతులు పూడ్చాలంటున్న వాహనచోదకులు**



**హిరమండలం, ఆగస్టు 29 (వార్త):** "ఏ రహదారి చూసినా ఏమున్నది గర్వకారణం...ఏపి రహదారులు సమస్తం ప్రమాదాల పరాయణత్వం" అని నిరభ్యంతరంగా చెప్పవచ్చు. అలికాం-బత్తిలి ప్రధాన రహదారి దుస్థితిని గమనిస్తే.. ఇదేదో సరదాగా చెప్పుకునే కవిత్వం కాదు... రక్తమోడుతున్న రోడ్ల సాక్షిగా కనిపించే దారుణమైన వాస్తవం. అలికాం-బత్తిలి ప్రధాన రహదారి నిత్యం వంద లాది వాహనాలు రాకపోకలు జరుగుతుంటాయి. హిరమండలంలో ఆర్టీసి బస్ స్టేషన్‌కు సమీపంలోనే పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. గత రెండు రోజులుగా కురిసిన వర్షానికి జలమయంగా మారింది. పెద్ద పెద్ద గోతులు కావటంతో వాహనాలు అదుపు తప్పి పడి పోయిన సంఘటనలు నెలకున్నాయి. అధికార యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో మరింతగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గత రెండు రోజులుగా కురు స్తున్న వర్షాలకు గోతుల్లో వర్షపు నీరు చేరి చాలామంది ద్విచక్రవాహన దారులు నీరు కదా అని వెళ్లే సమయంలో గోతిలో పడిన సంఘ టనలు నెలకున్నాయి. ఇంత దారుణంగా రహదారి మారటంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మత్తులు జరిపించలేని పరిస్థితిలో సంబంధిత అధికారులు ఉన్నారు. అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిలో ఆమదాలవలస నుంచి మొదలుకుని ఎల్ఎన్‌పేట మండలం బొర్రంపేట వరకు రహదారిలో ఎక్కడపడితే అక్కడ గోతులుగా మారాయి. హిరమండలం ఆర్టీసి బస్‌స్టేషన్‌కు సమీపంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల పడుతున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి మరింత దారుణంగా మారింది. దీంతో పాటు కొత్తూరు నుంచి బత్తిలి వరకు కూడా రహదారి ఉందా.. అన్నది సందేహంగా మారింది. కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో అది గొయ్యో...రహదారో.. తెలియని పరిస్థితి లో గోతిలో పడి ప్రమాదాలు కోరి తెచ్చుకుంటున్న సంఘటనలు నెలకున్నాయి. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇదే రహదారిపై ప్రయాణిస్తున్నా... పట్టించుకోకపోవటం గమనార్హం. తక్షణమే రహదారులను తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



# సదరం సర్టిఫికేట్లపై పూర్తిస్థాయిలో విచారణ

*** త్వరలో రేషన్ డీలర్ల పోస్టులు భర్తీ**
*** ఎమ్మెల్యే కూన రవికుమార్**
*** మండల సర్వసభ్య సమావేశంలో పలువురు అధికారులపై ఎమ్మెల్యే ధ్వజం**



**పొందూరు, ఆగస్టు29(వార్త):** సదరం ధ్రువీకరణ ద్వారా పింఛన్లు పొందుతున్న వారిజాబితాలను విచారణ చేపట్టి ఫేక్ సర్టిఫికేట్లు గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమలదావలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కిల్లా ఉషారాణి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సదరం ధ్రువీకరణలతో వికలాంగులు కానివారు సైతం పింఛన్లు పొందుతున్నారని వీనిపై విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. సదరంలో వికలాంగులు కానివారికి పర్మినెంట్ ధ్రువీకరణ పత్రాలు ఎలా ఇచ్చారన్నారు. ఈనెల 31న పింఛన్లు పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో వాలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ 83శాతం జరిగిందని నేడు టీడీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగుల ద్వారా 97శాతం పూర్తి చేస్తున్నామని చెప్పారు. దాదాపుగా 17శాతం పార్టీలపై వివక్షత కారణంగా వాలంటీర్లు పంపిణీ చేపట్టేవారు కాదన్నారు. నేడు అర్హులైన వారందరికీ పింఛన్లు పంపిణీ చేపడుతున్నామన్నారు. మండలంలో ఖాళీ ఉన్న డీలర్లు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని తహసీల్దార్ రమేష్‌కుమార్‌ను ఆదేశించారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి డిపోకు సరుకులు వెళ్లే క్రమంలో బస్తాల నుంచి కొందరు హమాలీలు సరుకులు నుంచి తొలగించడం జరుగుతుందని తన దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, భూములకు చెందిన డాక్యుమెంట్స్‌పై జగన్ మోహన్‌రెడ్డి పొటోలు ఉంటే చెల్లవన్నారు. శతశాతం ప్రజలురెవిన్యూ సదస్సును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారి బెండి బాబ్జీ పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎరువులు విక్రయాలు జరిగినప్పటికీ ఇంకా ఆన్‌లైన్‌లో నిల్వలు ఉన్నట్లు చూపిస్తే మరలా అవసరం మేరకు మంజూరు ఎలా జరుగుతుందని ఏవోని నిలదీశారు. మండలంలో మండంలో విఏఏలు పనితీరు బాగులేదని వారికి మెమోలు జారీచేయాలని ఏవోని ఆదేశించారు. మండలంలోని చేపట్టిన నాడు-నేడు పనుల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని పలువురు సభ్యులు ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకురాగా వాటిపై విచారణ చేపడతానని తెలిపారు. ఇంటింటికి కుళాయిలు పథకం మండలంలో చేపట్టిన గ్రామాల్లో రహదారులపై గోతులు పూడ్చలేదని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఎక్కడెక్కడ ఇంటింటికీ కుళాయిలు ఇచ్చారు, ఏమేరకు పనులు చేపట్టారో పూర్తి జాబితాలు తీసుకురావాలని ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ చైతన్యకు ఆదేశించారు. గృహ నిర్మాణాల లబ్ధిదారుల నుంచి లంచాలు తీసుకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు. మండలంలోని కొటిపల్లి, ధర్మపురం, తండ్యాం, బాణాం, నరసాపురం గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి నివేదికలు ఇవ్వాలని ఎమ్మెల్యే తహసీల్దార్‌ను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో సీపాన హరిహరరావు, ఎంఈవో పీవీ రామరాజు, పట్నాన రాజారావు, ఎపీఎం శ్యామలరావు, ఎపీవో శ్రీనివాసరావు, వైద్యాధికారులు రమేష్‌నాయుడు, శివశంకర్, సుధీర్‌కుమార్, ఈవోఆర్‌డీ సింహాచలం, ఎంపీటీసీలు కూన ప్రమీల, అన్నెపు కుమారి, బాడాన హారిక, కాకర్ల చెల్లమాంబ, కిల్లాన సూర్యారావు, బోత్స రమణ, మొదలవలస సీతారామారావు, కూటికుప్పల హనుమంతురావు, లింగాల రాజయ్య, సర్పంచ్‌లు జాడ శ్రీనివాసరావు, పి.ప్రసాదరావు, పప్పల వేణుగోపాలరావు, బుడుమూరు పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## శతశాతం పింఛను పంపిణీకి చర్యలు

**హిరమండలం, ఆగస్టు 29 (వార్త):** సెప్టెంబరు నెలకు సంబంధించిన సామాజిక ఫించన్లు సెప్టెంబరు మొదటి తారీఖు ఆదివారం కావటంతో ఈ నెల 31న లబ్దిదారులకు శతశాతం ఫించన్లు పంపిణీ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ బి.శైలజ సూచించారు.గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.ఈ మేరకు ఆమె మాట్లాడుతూ మండలంలో 5,929 మంది ఫించన్‌దారులకు రూ.2కోట్ల 43 లక్షల 63 వేలు మంజూరయ్యాయన్నారు.వీటిని ఈ నెల 31న శతశాతం పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఏమైనా ఇతర కారణాలతో మిగిలిన పంపిణీ చేయని ఫించన్లను సెప్టెంబరు 2న అందజేయటం జరుగుతుందన్నారు.

## మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 29(వార్త):** పెద్దపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం (బాలికలు)లో మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్టు ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ఎస్సీ కేటగిరిలో 19 సీట్లు, ఓసి 1, 6వ తరగతి ఎస్సీ కేటగిరిలో 5 సీట్లు, 9వ తరగతి ఎస్సీ కేటగిరిలో 1 సీటు, ఎస్‌టి కేటగిరీలో 1 సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ 7 ఎస్సీ కేటగిరిలో, బైపీసీ ఎ సి.6, ఎస్‌టి కేటగిరీలో 1, బీసీ కేటగిరీలో 1, ఓసీ కేటగిరిలో 1 ఖాళీగా ఉన్నాయని తెలి పారు. సీట్లు కావాల్సిన విద్యార్థినులు ఈ నెల 30న ఉద యం 10 గంటలకు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో గురుకులంలో హాజరు కావాలని కోరారు. సీట్లకు మించి అధికంగా విద్యార్థుల హాజరైతే పరీక్ష విధా నాన్ని బట్టి సీట్లు కేటాయిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

## 3 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

**శ్రీకాకుళం, ఆగస్టు 29 (వార్త):** శ్రీకాకుళం నగరంలో సెప్టెంబరు 3 నుంచి 6వ తేదీ వరకు ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ (అండర్-19) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నామని బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లం శెట్టి సాగర్ తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళంలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చీఫ్ ప్యాట్రన్ గూడేన సోమేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి నారాయణశెట్టి వెంకటకిరణ్‌కుమార్ కలిసి క్రీడలకు సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు.

## 40 కోట్లతో.. మల్టీపర్పస్..
# స్పోర్ట్స్ కాంప్లెక్స్

* రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేస్తాం
* కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
* త్వరలో కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణం పూర్తి
* శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
* ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం




**శ్రీకాకుళం, ఆగస్టు 29 (వార్త):** మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.40 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఖేలో ఇండియా పథకంలో భాగంగా పాత్రునివలసలో కేంద్ర ప్రభుత్వ నిధులతో దీని నిర్మాణం పూర్తి చేసి రెండేళ్లలో క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకొస్తామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. అలాగే పాత్రునివలసలో ఇప్పటికే నిర్మిస్తున్న క్రీడా వికాస ప్రాంగణంతో అన్ని క్రీడాంశాలను ఒకే చోటుకు తీసుకువస్తామని చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శాంతినగర్ కాలనీలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ కు దేశం మొత్తం ప్రతి ఏటా ఇచ్చే గొప్ప నివాళిగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. చదువుతో పాటు క్రీడలను సమన్వయం చేసుకున్నవారు జీవితంలో అత్యున్నత స్థానాలకు చేరుకుంటారని చెప్పారు. ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తే మానసిక దృఢత్వం సాధించవచ్చని, క్రీడలలో పాల్గొనడం ద్వారా నాయకత్వ లక్షణాలు అందుకోవచ్చని, గెలవడం కోసం చేసే ప్రణాళిక, శిక్షణ ఇవన్నీ భవిష్యత్తుకు మంచి బాటలు వేస్తాయని చెప్పారు. కోడి రామకృష్ణ స్టేడియం చుట్టూ ప్రేక్షకుల గ్యాలరీ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కోడి రామకృష్ణమూర్తి స్టేడియం నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులో తీసుకువస్తామన్నారు. ప్రతివారం పనుల పురోగతిని తాను స్వయంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. క్రీడలలో పాల్గొనడం గొప్ప అవకాశమని, దానిని వదులుకోవద్దని, క్రీడాభివృద్ధికి క్రీడాకారులు, ఆయా క్రీడా సంఘాలు తగిన సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. క్రీడా దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడాంశాలలో విజయం సాధించిన వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్, ఎమ్మెల్యే ఇద్దరు కలిసి పలువురు క్రీడాకారులను శాలువ, మెమొంటో, ధ్రువీకరణ పత్రాలతో సత్కరించారు. తొలుత కార్యక్రమంలో ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు ఏడు రోడ్ల కూడలి నుంచి శాంతినగర్ కాలనీ ఇండోర్ స్టేడియం వరకు క్రీడాకారులు 2కే ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఎస్డివో కే.శ్రీధర్, సెట్ శ్రీ సీఈవో ప్రసాదరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్ నారాయణరావు, ఒలింపిక్ అసోసియేషన్ సలహాదారు సుందరరావు మాస్టారు, కోచ్‌లు మాధురి, మణికంఠ, పలు క్రీడాభిమానులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### తెలుగు భాష పునరుజ్జీవమే
# కూటమి ప్రభుత్వ లక్ష్యం

* గిడుగు ఆశయాన్ని నెరవేరుస్తాం * ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్
* స్మృతి వనంలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు జయంతి

**శ్రీకాకుళం, ఆగస్టు29 (వార్త):** తెలుగు భాష పునరుజ్జీవమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుం దని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మాతృభాష దినోత్సవంతో పాటు తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా శ్రీకాకుళం గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతి వనంలో గిడుగు విగ్రహానికి ఎమ్మెల్యే పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధి కోసం తమ ప్రభుత్వమే గతంలో కూడా ఎంతో కృషి చేసిందన్నారు. తెలుగుని వ్యవహారిక భాషగా మలిచేందుకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి అనిర్వచనీయమైనదని కొనియాడారు. పర్వతాల పేటలో జన్మించిన గిడుగు ప్రపంచం అంతా గర్వించే తెలుగు భాషకు చేసిన సేవకి గుర్తుగా ప్రభుత్వమే అధికారికంగా గిడుగు జయంతి కార్యక్రమం నిర్వహించాలని ఎమ్మెల్యే అన్నారు. వైసీపీ పాలనలో తెలుగు భాషను అంతమొందించేందుకు పనిచేశారని దుయ్య బట్టారు. తమ ప్రభుత్వం మాతృభాషలోనే పరిపాలన, విద్యాబోధన చేపట్టి తెలుగు భాషను కాపాడుకుంటామన్నారు. తెలుగు భాష గొప్పతనం కోసం గిడుగు చేసిన సేవలను కొనియాడుతూ అవధాన పండితులు పైడి హరినాధరావు, నిష్టల నరసింహమూర్తి గేయాలు ఆలపించారు. గిడుగు విగ్రహ దాత మండపల్లి రామకృష్ణారావు మాస్టారును ఎమ్మెల్యే అభినందించారు. కూన రవికి గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు మెమొంటోని ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకర్, నటుకుల మోహన్, మెట్ట అనంతం బట్లు, పందిరి అప్పారావు, సువ్వారి రాజారావు, శాస్త్రీ తదితరులు ఉన్నారు.



## తిరుమలరావు మాస్టర్‌కి జనజాగృతి సత్కారం

**కొత్తూరు,ఆగస్టు29(వార్త):** కడుము గ్రామ పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రోపాధ్యాయునిగా పనిచేస్తున్న కుదమ తిరుమలరావుకు పలాస కాశీబుగ్గ జనజాగృతి ఆధ్వర్యంలో కాశీబుగ్గలో సన్మానించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేదికపై తెలుగుకు పట్టిన గొడుగు వెలుగులు పంచిన గిడుగు అనే కవితను తిరుమలరావు వినిపించారు. అనంతరం జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డా.తెప్పల కృష్ణమూర్తి, అధ్యక్షులు డా.కుమార్ నాయక్, ప్రముఖ సాహితీవేత్తలు కుత్తుమ వినోద్, కె.రోజారాణి తదితరుల చేతులమీదుగా తిరుమలరావును శాలువా, జ్ఞాపిక, బోన్సాయ్



మొక్కలతో ఘనంగా సన్మానించారు. తిరుమలరావును రాజాం రచయితల వేదిక కన్వీనర్ గార రంగనాథం తదితరులు అభినందనలు తెలిపారు.

## రామకృష్ణాపురంలో దొంగతనం

**జలుమూరు, ఆగస్టు29 (వార్త):** రామకృష్ణాపురంలో రేగాన విష్ణుమూర్తి ఇంటిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. మూడు తులాల బంగారం, 15 తులాల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. విష్ణుమూర్తి తన కుమార్తె గృహ ప్రవేశానికి బూర్జ మండలం సుంకరి పేటకు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం వెళ్లారు. గురువారం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి వెనుకభాగంలో తలుపులు తీసి ఉండడం, బీరువా పగుల గొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, క్లూస్‌టీం ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. విష్ణుమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

**పోలాకి, ఆగస్టు 29 (వార్త):** పోలాకి మండలంలోని డోల, రాజారాం పురం సముద్ర తీరంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. మండలంలో ఎలాంటి అధికారిక ఇసుక ర్యాంపులు లేవన్నారు. కల్తీ ఉప్పు ఇసుకతో.. వినియోగదారులు మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవన్నారు. కొందరు డబ్బు కోసం సముద్ర తీరంలోని ఇసుకను భవన నిర్మాణాలకు తరలిస్తూ కాసులు చేసుకుంటున్నారన్నారు. అటువంటి వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413